క్లుప్తంగా

నేడు పీఏసీఎస్ కార్యాలయంలో సమావేశం

కందుకూరు: రైతుబంధు పథకం అంశంపై చర్చించడానికి మంగళవారం పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో చైర్మన్ చంద్రశేఖర్ అధ్యక్షతన ప్రత్యేక సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నామని సీఈఓ యాదగిరిరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవనున్న సమావేశానికి డైరెక్టర్లు, సంఘం సభ్యులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

కారకులపై చర్యలు తీసుకోండి

ఎమ్మెల్యే దిష్టిబొమ్మ దహనంపై బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు



ఠాణాలో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

కందుకూరు: మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి పార్టీ మారుతున్నారనే అసత్య ప్రచారంతో ఆమె దిష్టిబొమ్మను దహనం చేసిన కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కోరారు. బీఆర్ఎస్ మహేశ్వరం గ్రామ అధ్యక్షుడు డి.కృష్ణయాదవ్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సోమవారం స్థానిక పీఎస్‌లో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అనవసరంగా పార్టీ మారుతున్నారనే ప్రచారం చేస్తూ సబితారెడ్డి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యవహరిస్తూ ఆమె దిష్టిబొమ్మను దహనం చేయడం హేయమైన చర్య అన్నారు. అందుకు కారకులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సయ్యద్ ఆదిల్‌అలీ, నవీన్, వాసుబాబు, ప్రభాకర్, సుదీర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



ఆలయ ప్రతినిధులకు చెక్కు అందజేస్తున్న కార్పొరేటర్ రాజేందర్‌రెడ్డి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడలోని పోచమ్మ దేవాలయానికి లయన్స్ క్లబ్ సభ్యుడు, 41వ డివిజన్ కార్పొరేటర్ బొక్క రాజేందర్‌రెడ్డి రూ.2లక్షల 22వేల 999లు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధులకు ఆయన చెక్కు ఇచ్చారు. అనంతరం రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి తన వంతు బాధ్యతగా ఆర్థికసాయం అందజేశానని, భవిష్యత్‌లోనూ తన సహకారం ఉంటుందని తెలిపారు.

సాగుకు సమాయత్తం

విత్తనాలు, ఎరువుల కొనుగోలులో రైతన్న బిజీబిజీ



కందుకూరు చౌరస్తాలో ఓ ఫర్టిలైజర్ షాపు వద్ద రైతులు

కందుకూరు: ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రైతన్నలు పంటల సాగుకు సమాయత్తం అవుతున్నారు. కాగా ఈ ఏడాది వర్షాలు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. ఇన్ని రోజులు నిరీక్షించిన అన్నదాతలు మండలంలో రెండురోజుల నుంచి వర్షాలు ఓ మోస్తరుగా కురుస్తుండటంతో ఆశతో పంటల సాగులో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడానికి ఫర్టిలైజర్ దుకాణాలకు తరలివస్తున్నారు. దీంతో ఫర్టిలైజర్ దుకాణాల వద్ద రైతన్నలతో సందడి నెలకొంది.

వసతుల కల్పనకు కృషి

ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్

ఇబ్రహీంపట్నం రూరల్: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేశామని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేశ్ అన్నారు. సోమవారం మండలంలోని పోచారం గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో రూ.ఆరు లక్షలతో భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలాన్ని గత ఐదేళ్లుగా అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. అన్ని గ్రామాలకు సమానంగా నిధులు కేటాయించామన్నారు. ఎక్కడ చూసిన సీసీ రోడ్లు, విద్యుద్దీపాలు, డ్రైనేజీ సమస్యలు లేకుండా చేశామని గుర్తు చేశారు. సేవ చేయడానికి ప్రజలు అవకాశం కల్పించారని తప్పకుండా వారి నమ్మకాన్ని నిలబెట్టానని తెలిపారు.

వన మహోత్సవానికి వేళాయె!

- మండలంలో లక్ష మొక్కలు నాటడమే లక్ష్యం
- స్థలాలు గుర్తిస్తూ.. గుంతలు తవ్విస్తూ..
- ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



నాగిరెడ్డిపల్లి నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజ, ఉపాధి హామీ అధికారులు

మహేశ్వరం: ప్రతీ గ్రామంలో పచ్చదనాన్ని పెంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తున్నారు. అడవుల శాతాన్ని గణనీయంగా పెంచాలన్న ప్రభుత్వ ఆదేశాలతో అధికార యంత్రాంగం పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ జిల్లాలోని వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలు నాటారు.

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో..

మహేశ్వరం మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు ప్రత్యేకంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లోని నర్సరీల్లో సుమారు 3.50లక్షల మొక్కలను పెంచుతున్నారు. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన నర్సరీలో సుమారు 10 వేల మొక్కలు పెంచుతున్నారు. పెద్ద గ్రామ పంచాయతీలో సుమారు 15 వేల మొక్కలు పెంచుతున్నారు.

మొత్తం లక్ష మొక్కలు..

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో వన మహోత్సవం కార్యక్రమం కింద 1 లక్ష మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి గ్రామ పంచాయతీలో 3,500 మొక్కలు నాటాలని ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు సమయానికి కురవక పోవడంతోనే వన మహోత్సవం కింద మొక్కలు నాటడం ఆలస్యమైందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పుడు వర్షాలు కురుస్తుండడంతో మొక్కలు నాటేందుకు గుంతలు తీయడం, మొక్కలు పెంచడంతో పాటు పలు ఏర్పాట్లు అధికారులు చేస్తున్నారు. 31 గ్రామ పంచాయతీలకు అవసరమైన మొక్కలను సిద్ధం చేశామని త్వరలో నాటుతామని పేర్కొంటున్నారు. అధికారులు ఇప్పటికే మొక్కలు నాటడానికి 5 వేల గుంతలను తీయించారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే మొక్కలు నాటుతామని చెబుతున్నారు. గ్రామ పంచాయతీకి వచ్చే నిధుల్లో 10 శాతం నిధులను గ్రీన్ బడ్జెట్‌కి వినియోగించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ప్రత్యేక రక్షణ చర్యలు..

గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో పూలు, పండ్ల మొక్కలతో పాటు ఔషధ గుణాలు కలిగిన మొక్కలను పెంచుతున్నారు. కూలీలను పెట్టి ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకున్నారు. ఎండ, వేడిమి నుంచి తట్టుకునేలా గ్రీన్‌నెట్ వేసి నిత్యం మొక్కలకు నీరు పోస్తూ, నర్సరీలలో కలుపు తీయడం, సమయానికి ఎరువులు వేశారు. గ్రామాల్లో ఉన్న నర్సరీలతో పాటు ఉపాధి హామీ అధికారులు, ఫారెస్టు అధికారుల ఆధ్వర్యంలో మొక్కలను ఏపుగా పెంచుతున్నారు.

పండ్లు, పూల మొక్కలు సిద్ధం..

మండలంలో ఉన్న నర్సరీలలో ప్రధానంగా పండ్లు, పూలు, ఔషధ మొక్కలతో పాటు ఇతర మొక్కలను పెంచుతున్నారు. నేరేడు, జామ, దానిమ్మ, ఉసిరి, కానుగ, గుల్‌మోహార్, మునగ, కరివేపాకు, ఎల్లో టికోమా మొక్కలతో పాటు పలు రకాల మొక్కలను నాటేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు.

లక్ష్యం లక్ష..



వన మహోత్సవ కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం. మండలంలో 31 గ్రామ పంచాయతీలలో లక్ష మొక్కలు నాటాలని లక్ష్యంగా ఎంచుకున్నాం. ప్రతి గ్రామ పంచాయతీలో 3,500 మొక్కలు నాటాలని ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశాం. దానికి తగ్గట్లు మొక్కలు సిద్ధం చేసి, గుంతలు తవ్వడం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 5 వేలకు పైగా గుంతలు తవ్వాం. వర్షాలు కురవగానే మొక్కలు నాటుతాం. ప్రతి ఇంటికి ఆరు పండ్లు, పూలు, ఔషధ మొక్కలను పంపిణీ చేస్తాం.

– శైలజ, ఎంపీడీఓ

ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే..



నందుపల్లి గ్రామ పంచాయతీలో నర్సరీలో సుమారు 10 వేల మొక్కలు పెంచుతున్నాం. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఒక్కో గ్రామ పంచాయతీకి 3,500 మొక్కలు నాటాలని ఉన్నతాధికారులు లక్ష్యం ఇచ్చారు. ఎక్కడెక్కడ మొక్కలు నాటాలో స్థలాలను గుర్తించాం. ప్రస్తుతం మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వకాలు చేపడుతున్నాం. వర్షాలు కురవగానే ఉన్నతాధికారుల ఆదేశాలు రాగానే మొక్కలు నాటుతాం.

– శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, నందుపల్లి

మత్తు పదార్థాలపై కొరడా

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ మంద జ్యోతిపాండు
- సమస్యల పరిష్కారానికి గళమెత్తిన ఎంపీటీసీలు



సమావేశంలో ఎంపీపీ, ఇతర ప్రజాప్రతినిధులు

కందుకూరు: గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయాలపై నిఘా పెట్టి పిల్లల భవిష్యత్‌ను కాపాడాలని ఎంపీపీ మంద జ్యోతిపాండు అధికారులను ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన ప్రస్తుత పాలక వర్గం చివరి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖపై నిర్వహించిన చర్చలో ఎంపీపీ మాట్లాడారు. మండలంలో గంజాయి తాగి యువత పాడవుతున్నారనే విషయం మా దృష్టికి వచ్చిందని.. దానిపై పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్టు షాపులపై ఏం చర్యలు తీసుకుంటున్నారంటూ సభ్యులు ఎం.యాదయ్య, రాజశేఖర్‌రెడ్డి, జ్యోతి, లక్ష్మీ ఎక్సైజ్ అధికారిని నిలదీశారు. చెరువులు, కట్టలపై ముళ్ల చెట్లు తొలగింపుతో పాటు కొత్తగూడ సున్నం చెరువు కట్టపై పగుళ్లు ఏర్పడ్డాయని, మరమ్మతులు చేయించాలని సభ్యుడు రాములు, బఫర్ జోన్‌లో వెంచర్లు నిర్మిస్తున్నా ఇరిగేషన్ అధికారులు ఏం చేస్తున్నారని సభ్యుడు ఎస్.ఎల్లారెడ్డి ప్రశ్నించారు. సక్రమమైన భూములు సైతం ధరణిలో నిషేధిత జాబితాలో చే ర్చడంతో ఇబ్బందిగా మారిందని సభ్యులు మల్లేష్, ఇందిర, రాములు, జ్యోతి, లక్ష్మీ, ఇందిర, రాజశేఖర్‌రెడ్డి అధికారుల దృష్టి తెచ్చారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో వాచ్‌మెన్‌ను నియమించాలని వైద్యాధికారిణి రాధిక కోరారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయాలు చేపట్టకుండా చర్యలు తీసు కోవడంతో పాటు ప్రభుత్వం త్వరలో అమలు చేయనున్న రుణమాఫీ పథకాన్ని రైతులకు మేలు జరిగేలా పకడ్బందీగా అమలు చేయాలని వైస్ ఎంపీపీ శమంత వ్యవసాయ అధికారులను కోరారు. అలాగే ఇతర సభ్యులు తమ తమ గ్రామాల్లో నెలకొ న్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చా రు. అనంతరం సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, సభ్యులు రాజమ్మ, లలిత, పద్మ, ఇందిర, లక్ష్మి, జ్యోతి, సురేశ్, రాములు, ఎల్లారెడ్డి, మల్లేశ్, యాద య్య, రాజశేఖర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సబితారెడ్డి దిష్టిబొమ్మ దహనం



మహేశ్వరంలో ఎమ్మెల్యేకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని ప్రచారం కావడంతో సోమవారం మహేశ్వరంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు బంగారుగళ్ల లాజర్, సీనియర్ నాయకుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆమె దిష్టిబొమ్మ దహనం చేశారు. సబితారెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి రావద్దని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీతఅంధ్యానాయక్, నాయకులు రఘుపతి, కృష్ణనాయక్, పాండునాయక్, కొమురయ్య, వెంకటేశ్, జంగయ్య, రాములు, విజయ్‌సూర్య, రాకేశ్, శ్రీను, శివ, శేఖర్‌రెడ్డి, లింగారెడ్డి పాల్గొన్నారు.

ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

మహేశ్వరంలోని చైతన్య పాఠశాల ఎదుట ఏబీవీపీ ధర్నా



ధర్నా చేస్తున్న నాయకులు

కందుకూరు: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నడుస్తున్న చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు కందడి శ్రీరామ్ డిమాండ్ చేశారు. సోమవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో మహేశ్వరంలోని చైతన్య పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇక్కడ కార్పొరేట్ అని చెబుతూ చైతన్య పాఠశాలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు ఒకసారి సీజ్ చేసినా మళ్లీ తెరిచారన్నారు. ఆ పాఠశాల యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నగర కార్యదర్శి జమాల్‌పూర్ రాఘవేందర్, టౌన్ జాయింట్ సెక్రటరీ రాజేశ్, నాయకులు సిద్దు, ప్రవీణ్, అభిలాష, లఖాన్, నవీన్, సయీద్, శ్రీకాంత్, దుర్గ, ప్రసాద్, ప్రణీత్, రోహిత్, చరణ్ పాల్గొన్నారు.

నీరు నిలిచి.. దుర్గంధం వ్యాపించి

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



ఈ-సిటీ రోడ్డులో నిలిచిన మురుగు నీరు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని ఈ–సిటీ కమాన్ నుంచి శ్రీ ఆదిలక్ష్మి వెంకటేశ్వర ఆలయానికి వచ్చే దారిలో మురుగు నీరు నిలుస్తోంది. మురుగు నీరు పోవడానికి ఉన్న కాల్వ పూడుకపోయింది. దీంతో నీరు ఎక్కడికి పోలేక కొద్దిరోజుల నుంచి ఇక్కడే నిలిచి, దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో ఈ రోడ్డులో వచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మురుగునీరు పోవడానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేసినా వారు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సిబ్బంది స్పందించి కాల్వకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజారులలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) ఈ విధంగా ఉన్నాయి. టమాట 43, వంకాయ 35, బెండ 28, పచ్చిమిర్చి 70, కాకర 38, బీర 35, క్యాబేజ్ 35, ఫ్రెంచి బీన్స్ 105, క్యారెట్ 38, దొండ 15-18, చిక్కుడు 75, గోకర 50, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలు 40, దోస 20, సొర 9, పొట్ల 18, ఉల్లిగడ్డ 39, చామగడ్డ 35లు ఉండగా ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయని సంబంధిత అధికారులు తెలిపారు.

దేవాలయ పాలకవర్గం ఎన్నిక

వనస్థలిపురం: వీరశైవ సమాజం ఆధ్వర్యంలోని వనస్థలిపురం ఫేజ్–1లోని శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం పాలకవర్గాన్ని సోమవారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా కరిబె శాంతప్ప, అధ్యక్షులుగా దీపావళి శ్రవణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా ఎస్.ఎం.అరుణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బి.రవికుమార్, సహాయ కార్యదర్శిగా బి.గౌరీశంకర్, కోశాధికారిగా చౌదరి దివాకర్ లింగం, కార్యవర్గసభ్యులుగా కుషాల్‌కుమార్, గణేష్ ఎన్నికయ్యారు.

వైద్య వృత్తి విలువైనది

ఆమనగల్లు: వైద్య వృత్తి ఎంతో విలువైనదని లయన్స్‌క్లబ్ జిల్లా వివిధ విభాగాల అధ్యక్షులు నటరాజ్ యాదయ్య, చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి అన్నారు. ప్రాణాన్ని నిలిపే వైద్యులు దైవ సమానులన్నారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం జాతీయ డాక్టర్స్ డే వేడుకలు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు దొంతు పుల్లయ్య, దామోదర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, స్రవంతి, శ్రీనివాస్‌రెడ్డి, హరికాంత్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, హరీష్‌రెడ్డి, అడపాల దివ్య, అఖిల్, కల్యాణ్‌రెడ్డి, వేణుగోపాల్, నాగరాజులను సత్కరించారు. గ్రామీణ ప్రాంతాల వారికి వైద్యులు శిబిరాల ద్వారా వైద్య సేవలు అందించాలని వారు కోరారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పీఆర్‌ఓ ఎంఏ పాషా, అంజయ్య, రమేశ్, లింగయ్య, యాదయ్య, నర్సింహ, బాలకృష్ణ, నరేందర్‌రెడ్డి, ఓంకారం, ఎంపీహెచ్‌ఈఓ తిరుపతిరెడ్డి, ఆశ, పాల్గొన్నారు.

లిమ్స్‌లో డాక్టర్ డే వేడుక

ఇబ్రహీంపట్నం: గ్రామీణుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామని ఇబ్రహీంపట్నంలో లిమ్స్ ఆస్పత్రి ఎండీ విశ్వనాథ్ అన్నారు. సోమవారం లైఫ్ కేర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ఆస్పత్రి(లిమ్స్)లో వైద్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ డేను పురస్కరించుకొని ఈనెల 30వ తేదీ వరకు గుండె, కిడ్నీ, లివర్, బ్రెయిన్, థైరాయిడ్ తదితర పరీక్షలను తక్కువ ధరకు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో వైద్యులు సహదేవరెడ్డి, రాంరాజ్ పాల్గొన్నారు.

ఘనంగా అక్షరాభ్యాసం



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న పురోహితుడు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని సీతామెడోస్ కాలనీలోని రవీంద్రభారతి పాఠశాలలో సోమవారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. చిన్నారుల తల్లితండ్రులు పాఠశాలకు చేరుకొని పురోహితుల ఆధ్వర్యంలో చిన్నారులకు అక్షరాలు(ఓనమాలు) దిద్దించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హైమావతి, డీఐ క్రాంతి కుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది, పేరేంట్స్ పాల్గొన్నారు.

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి గాయత్రీనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో సోమవారం అక్షరాభ్యాస కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు నాగమల్లేశ్వరి, డీన్ ప్రమీల ముఖ్య అతిథులుగా పాల్గొని నర్సరీ చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ పాఠశాలల్లో చిన్ననాటి నుంచే మన సంస్కృతి సంప్రదాయాలు, పండుగల పట్ల అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పదవులు శాశ్వతం కాదు

- సేవలే చిరకాలం గుర్తుంటాయి
- ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ఆమనగల్లు: పదవులు ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజలకు చేసిన సేవలే చిరకాలం గుర్తుంటాయని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆమనగల్లులోని శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో సోమవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కల్వకుర్తి నియోజకవర్గంలోని జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. నిరంతరం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలపై పోరాడేవారిని ప్రజలు పాలకులుగా ఎన్నుకుంటారని ఆయన అన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. గ్రూప్ 1, 2 పోస్టులను పెంచాలని ఆరు రోజులుగా నిరుద్యోగులు దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ మాట్లాడుతూ.. ట్రస్టు తరఫున ఇప్పటి వరకు రెండు వేల పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చామని, వేలాది మంది పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు దశరథ్‌నాయక్, అనురాధపత్యానాయక్, ఎంపీపీలు నిర్మల శ్రీశైలంగౌడ్, మనోహర, విజయ, వైస్ ఎంపీపీలు ఆనంద్, జైపాల్‌నాయక్, శాంతి, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు జీఎల్ఎన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దశరథ్‌నాయక్, లచ్చిరాంనాయక్, బుచ్చిబాబు, కుమార్, పత్యానాయక్, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

రేపు రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ

పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి

తలకొండపల్లి: రైతుభరోసా పథకాన్ని ఎలా అమలు చేయాలనే అంశంపై రైతులు, ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని వెంకటాపూర్ గేట్ వద్ద వెంకటేశ్వర ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం సహకార సంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా పథకంపై అభిప్రాయ సేకరణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సింగిల్‌విండో కార్యాలయంలో విలేకరులతో సోమవారం కేశవరెడ్డి మాట్లాడారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని చెప్పారు. సింగిల్‌విండో డైరెక్టర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు అధిక సంఖ్యలో హాజరై రైతు భరోసా పథకంపై సూచనలు తెలపాలని కోరారు.

మత్తుతో జీవితాలు నాశనం

అబ్దుల్లాపూర్‌మెట్: యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ విలువైన జీవితాలను నాశనం చేసుకుంటుందని రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో బృంద సభ్యులు, రాచకొండ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్‌రావు, ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. సోషియో స్పైర్ వారోత్సవాల్లో భాగంగా పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ పరిధిలోని డిస్కవరీ ఓక్స్ పాఠశాలలో సోమవారం ప్రకృతి వైపరీత్యాలు, లింగవివక్షత, మాదకద్రవ్యాల వినియోగంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి వారు హాజరై సూచనలు చేశారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన వారు జీవితాలను నాశనం చేసుకోవడంతో పాటు తమ నియంత్రణను ఎలా కోల్పోతారో తెలిపే వీడియో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సారా అంజుమ్, కో–ఆర్డినేటర్స్ సాగరిక, సూర్యప్రకాశ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.